క్లుప్తంగా

సామర్థ్యాల వెలికితీతకే అచీవ్‌మెంట్ పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న డైట్ వైస్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం

కార్వేటినగరం: విద్యార్థుల్లోని సామర్థ్యాలను వెలికితీయడానికే అచీవ్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యా శిక్షణా సంస్థ వైస్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌లో శుక్రవారం 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన సీసీ ఎగ్జామినేషన్ స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలను పరిశీలించారు. ప్రతి విద్యార్థీ ఉన్నత విద్యను అభ్యసించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాయత్రిదేవి, ఉపాధ్యాయులు, డైట్ ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకాశ కన్నియమ్మకు విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం పంచాయతీ కోన చెరువు సమీపంలో వెలసిన ఆకాశ కన్నియమ్మకు శుక్రవారం అమ్మవారికుప్పం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో అభిషేకం చేశారు. మధ్యాహ్నం మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి సమర్పించారు.

పీఎఫ్ విభాగం తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ కార్యాలయంలోని పీఎఫ్ విభాగంలో జెడ్పీ పరిధిలోని ఉద్యోగులు, టీచర్ల పీఎఫ్ మొత్తాల వివరాల నమోదుపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శుక్రవారం సీఈఓ ప్రభాకర్‌రెడ్డి నమోదును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎఫ్ జమ, రిజిస్టర్ల నిర్వహణ, కంప్యూటర్‌లో ఖాతాలను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. శ్రీకాళహస్తి డీఎల్‌డీఓ ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఐ కుటుంబానికి ఆర్థిక సాయం



చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖలో ఆర్‌ఎస్‌ఐగా పనిచేస్తూ మృతి చెందిన కమల్‌నాథ్ రెడ్డి కుటుంబానికి అధికారులు ఆర్థికసాయం అందజేశారు. చిత్తూరులోని పోలీసు కార్యాలయంలో శుక్రవారం మృతుడి సతీమణి విజయలక్ష్మికి రూ.75 వేల చెక్‌ను ఏఎస్పీ సుధాకర్ చేతులమీదుగా అందించారు. గతనెల 11వ తేదీ కమల్‌నాథ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఏఎస్పీ మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి జిల్లా పోలీసుశాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఏ సాయం కావాల్సినా ఎస్పీని సంప్రదించవచ్చని చెప్పారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు
టాస్క్‌ఫోర్స్ కమిటీలు

- ఆరోగ్య రంగంలో ఎస్‌డీజీ సాధనకు కృషి
- జీవో 34 విడుదల చేసిన ప్రభుత్వం



వైఎస్సార్ విలేజ్ క్లినిక్

పాలసముద్రం: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌తో వైద్యులు ఇంటి వద్దే వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా గ్రామాల్లోనే వైద్య పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. తాజాగా పంచాయతీ స్థాయిలోనే ఆరోగ్య పరిరక్షణకు టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 34ను విడుదల చేసింది. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో 140 గ్రామ పంచాయతీల్లో ఆరోగ్య రంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధన కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీలు కృషి చేస్తాయని అధికారులు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత సేవలు అందించేందుకు ఈ సరికొత్త విధానానికి రూపకల్పన చేసినట్టు వివరించారు.

ఆరుగురు సభ్యులతో కమిటీ

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఆరోగ్య రంగంలో సుస్థిర అభివద్ధి (ఎస్‌డీజీ) సాధన కోసం ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేస్తారు. ప్రతి గ్రామంలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి అర్హత కలిగిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో- మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్- ఎంఎల్ హెచ్‌వో)ను టాస్క్‌ఫోర్స్ కమిటీకి లీడర్‌గా నియమించనున్నారు. ఆ కమిటీలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్, అంగన్‌వాడీ వర్కర్, స్కూలు హెల్త్ అంబాసిడర్, గ్రామంలోని డ్వాక్రా గ్రూపు అధక్షురాలు కూడా ఉంటారు. వీరు గర్భిణులు, బాలింతల రక్తహీనతపై పర్యవేక్షణ, పిల్లల ఆరోగ్యం, జీవనశైలి, జబ్బుల నిర్ధారణ, వాటి నివారణ, చికిత్స తదితరాలపై ఎప్పటికప్పుడు కమిటీ లీడర్‌కు సమాచారం అందజేస్తారు. అదేవిధంగా విద్యార్థుల ఆరోగ్య వివరాలపై పాఠశాలలోని హెల్త్ అంబాసిడర్ సమాచారం ఇస్తారు. కౌమార దశలోని బాలికలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల్లో రక్తహీనతను గుర్తించి డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో సమన్వయం చేసుకుని ప్రతిరోజూ ఐఎఫ్‌ఏ మాత్రలు పంపిణీ చేస్తారు. యుక్త వయసులోని బాలికలకు శానిటరీ నాప్కిన్స్ సరఫరా, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు మధ్యాహ్న భోజనం అందజేసేలా చర్యలు తీసుకుంటారు. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తారు.

గ్రామాల్లో రక్త హీనతపై పర్యవేక్షణ

గర్భిణులకు ప్రసవానికి ముందు, ప్రసవం తర్వాత సంరక్షణ, నులిపురుగుల నిర్మూలన ముందుల పంపిణీ, పిల్లల ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం తదితర సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటారు. గ్రామాల్లో జరిగే జరిగే డ్వాక్రా గ్రూపు సమావేశాలకు టీమ్ లీడర్ విధిగా హాజరయ్యేలా డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు చూస్తారు. గ్రూపు సభ్యులు వారి నివాస ప్రాంతాల్లో ఏమైనా ఆరోగ్య సమస్యలున్నాయా అని తెలుసుకోవాల్సి ఉంటుంది. గ్రూపు సభ్యులకు ఆయా ప్రాంతాల్లో జీవనశైలిని బట్టి జబ్బుల నివారణ, పరీక్షలు, చికిత్సలు, ఇతర సమస్యలపై అవగాహన కల్పిస్తారు.

- ప్రసవానికి ముందు యాంటినేటర్ పరీక్షల సమయంలో యూఎస్‌జీ స్కానింగ్ ప్రాముఖ్యత, ఇమ్యునైజేషన్ ద్వారా రోగ నిరోధక శక్తిని పెంపొందించడం.
- బాల్య వివాహాల నివారణ ద్వారా యుక్త వయస్సు గర్భాలను నిరోధించడం.
- కుటుంబ నియంత్రణ ప్రణాళిక అమలు చేయడం . ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా చర్యలు.

పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు



కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీకి పంచాయతీ కార్యదర్శులు సహకారం అందిస్తారు. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశాం . గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

–లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి

ప్రజలకు ఎంతో ఉపయోగం



విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్‌ఎటాక్, క్యాన్సర్, హైపర్ టెన్షన్, తదితరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

–రవిరాజు, జిల్లా ఇమ్యునైజేషన్, అధికారి

సొంత ఊరుల్లోనే వైద్యం



ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. చిన్న చిన్న జబ్బులకు కూడా కిలోమీటర్ల దూరం వెళ్లి అవస్థలు పడకుండా ఉన్న ఊరులోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో వైద్య పరీక్షలు చేస్తున్నాం. తాజాగా టాస్క్‌ఫోర్స్ కమిటీల ఏర్పాటుతో ప్రజలకు మరింత మంచి జరుగుతుంది.

–వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, పాలసముద్రం

వైఎస్సార్ డిగ్రీ కళాశాలకు మహర్దశ



కళాశాల స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- రూ.20 కోట్లతో జీప్లస్ గదుల నిర్మాణానికి ప్రతిపాదన
- స్థల పరిశీలన చేసిన ఇంజినీరింగ్ అధికారులు

వెదురుకుప్పం: డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ పట్టింది. జీప్లస్ తరగతి గదుల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పక్కా భవనాల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం పచ్చికాపల్లం సమీపంలో డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మండలానికి డిగ్రీ కళాశాల మంజూరైంది. ప్రస్తుతం చవటగుంటలోని జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. పక్కా భవన నిర్మాణాన్ని చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చర్యలు తీసుకుంటున్నారు. సుమారు రూ.20 కోట్లతో జీప్లస్ తగరతి గదుల నిర్మాణాన్ని చేపట్టేందుకు అవసరమైన ప్లానింగ్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కళాశాల భవనాల నమూనాను తయారు చేసినట్లు విద్య, సంక్షేమం మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ ఇగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివప్రసాద్ తెలిపారు. పక్కా భవన నిర్మాణానికి స్థలం అనుకూలంగా ఉందని, సత్వర చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. కార్యక్రమంలో డీఈ జయకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారద, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పేట ఢిల్లీ ప్రసాద్‌రెడ్డి, బండి సభాపతిరెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు పేట ధనుంజయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మేలుజాతి దూడల ప్రదర్శన



మేలుజాతి దూడలను ఎంపిక చేసిన డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని చింతపెంట సచివాలయం పరిధిలోని రాఘవరెడ్డిపల్లిలో శుక్రవారం పశువైద్యాధికారి డాక్టర్ పార్థిబన్ ఆధ్వర్యంలో మేలుజాతి దూడల ప్రదర్శన, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్థక శాఖ డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందయ్య మాట్లాడుతూ పశుసంవర్థక శాఖ సూచనలు, సలహాలను పాటించి మేలుజాతి దూడలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంపిక చేసిన మేలుజాతి ఆబోతు నుంచి సేకరించిన వీర్యాన్ని పశు సంతతి పరిశీలనా పథకం ద్వారా రాయితీపై ఆవులకోసం మంత్రి రోజా చొరవతో స్థల వివాదానికి తెర అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు. ఈపీటీపీ సెమన్ ద్వారా పుట్టే దూడలు తల్లి ఆవు కన్నా ఎక్కువ మోతాదులో పాలు ఇస్తాయన్నారు. ఈ పథకం రాష్ట్రంలో చిత్తూరు జిల్లాలో మాత్రమే అమలులో ఉన్నట్టు తెలిపారు. దీన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మేలుజాతి దూడల ప్రదర్శనకు వచ్చిన దూడల్లో మంచి వాటిని ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీడీ మృణాళిని, పశుసంవర్థక శాఖ ఏడీ గీతారెడ్డి, పీటీపీ ఏడీ ఆసిఫ్, వీఏఏ జ్యోతి, ప్రకాష్ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో సజావుగా సంక్షేమం



వలంటీర్లు, గృహసారథులతో మంత్రి సోదరుడు

నగరి: సచివాలయం పరిధిలోని వలంటీర్ వ్యవస్థతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. నగరి మున్సిపాలిటీలోని 3, 4, 5, 25, 26 వార్డులు, మండలంలోని బీరకుప్పం, వీకేఆర్‌పురం సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో శుక్రవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలోనూ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఏకతాటిపై పనిచేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వారికి కేటాయించిన యాభై ఇళ్లలోని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లు జ్యోతి, భాస్కర్, గోపాల్‌రెడ్డి, దయానిధి, మునికృష్ణారెడ్డి, ఇంద్రయ్య, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, వైస్ ఎంపీపీ ఢిల్లీ, సర్పంచ్‌లు నందిని, సెల్వి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే అధిక పాల దిగుబడి



పాడి రైతులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి యసస్వి

పాలసముద్రం: పశువులకు పోషక విలువలు కలిగిన దాణా అందించడం ద్వారా అధిక పాలదిగుబడి పొందవచ్చని పశువైద్యాధికారి యసస్వి తెలిపారు. పాలసముద్రం గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం పాడి రైతులకు పశువుల పెంపకం, ఆరోగ్య రక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన మినరల్ మిక్చర్ వాడడం వల్ల పశువులు త్వరగా ఎదకు వస్తాయని చెప్పారు. హార్మోన్ల సమతుల్యత ఉంటుందని, దూడలకు వాడడం వల్ల వాటి ఎదుగుదల బాగుంటుందని తెలిపారు. అదేవిధంగా పాడి పశువులను పిడుదులు, ఈగలు లేకుండా రెండు రోజులకు ఒకసారి శుభ్రంగా కడగాలని తెలిపారు. అనంతరం 25 పశువులకు కృత్రిమ గర్భధారణ, 55 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స చేశారు. అనంతరం 12 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. అనంతరం దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు.

శ్మశాన స్థల వివాదానికి తెర



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం కైలాసపురం గ్రామ శ్మశానంలో నెలకొన్న స్థల వివాదం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చొరవతో పరిష్కారమైంది. వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి శుక్రవారం కైలాసపురం శ్మశానాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పెద్దలు, మహిళలతో మాట్లాడి రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా శ్మశానానికి స్థలాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులను ఆదేశించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి రోజాకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు పాతపల్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వడివేలురెడ్డి కుటుంబానికి మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. వడివేలు భార్య శకుంతల బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ద్రౌపదిదేవికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వేకువ జామునే అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ



పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేస్తున్న దాతలు డాక్టర్ పవన్‌కళ్యాణ్

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలలకు సౌండ్ సిస్టం అందించడం అభినందనీయమని కత్తెరపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కే.హేమారెడ్డి తెలిపారు. పాఠశాలకు శుక్రవారం వి.కోటకు చెందిన ఎండీహెచ్ ఎడ్యుకేషన్ చారిటబుల్ సంస్థ రూ.35 వేలు విలువైన సౌండ్ సిస్టంను వితరణ చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలకు చేయూత ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అతి చిన్న వయసులో ఇంతటి సేవా దృక్పథాన్ని అలవర్చుకున్న పవన్‌కళ్యాణ్ మరెంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు మంచి విద్యను అందించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం హెచ్‌ఎం హేమారెడ్డి దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అడ్వైజర్ డాక్టర్ శేఖర్, ఉపాధ్యాయులు వాసుదేవరెడ్డి, రవిచంద్రారెడ్డి, విశ్వనాథనారాయణ, సుదర్శనరాజు, సుజల, సత్యవతి, అక్కారిబాబు, భీమారావు, చలపతిరావు, శేఖర్, మధు, తిరుమలేశం రవి, మోహన్ మురళీ, శ్రీనివాసులు, హరి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం

శ్రీరంగరాజపురం: కార్పొరేట్ హాస్పిటల్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్యం అందిస్తున్నామని జిల్లా జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి డాక్టర్ రవిరాజు తెలిపారు. ఆయన శుక్రవారం శ్రీరంగరాజపురం మండలంలోని పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 10,386 బీపీ, షుగర్ కేసులు వెలుగులోకి వచ్చినట్టు తెలిపారు. 3008 మందికి కంటి అద్దాలు అందజేశామన్నారు. రోగులకు ప్రతి నెలా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని చెప్పారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు తదితర లక్షణాలు ఉన్నవారు వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి, సూపర్‌వైజర్ గంగాదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.